
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.2

ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 19 జూలై 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	505.10 (123.5012)	7,064	6,500
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	638.50 (2.88)	809.36	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	99.70 (0.73)	94	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.132 | డ్రెస్ : రూ.192 | స్కిన్‌లెస్ : రూ.220

జిల్లా రైతులకు రూ.481.63కోట్లు మాఫీ



రుణమాఫీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

రూ.31వేల కోట్లకు పైగా మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది ▸▸ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ/నల్లగొండ టౌన్, జూలై 18: రుణమాఫీ కింద రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లా రైతులకు రూ.481.63కోట్ల రుణమాఫీ అయ్యిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఏకకాలంలో రూ.31వేల కోట్లు రైతుల రుణ మాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు రుణమాఫీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. తొలుత సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో తిప్పర్తి మండలానికి చెందిన రాజు అనే రైతుతో మాట్లాడారు. అనంతరం మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సులో భాగంగా ఐదు కిలోమీటర్ల మేర జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించామని, తాను స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ వేదిక వద్దకు వచ్చానన్నారు. ర్యాలీలో రైతులు స్వచ్ఛందంగా పాల్గొన్నారని తెలిపారు. జిల్లాలో 83,121 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.481.63 కోట్ల రుణ మాఫీ సొమ్ము జమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రూ.31వేల కోట్ల రైతుల రుణాలు మాఫీ చేయడం దేశ చరిత్రలో లేనివిధంగా సాహసోపేత కార్యక్రమం నిర్వహించిందన్నారు. రైతులు అప్పులపాలు కాకూడదన్న ఉద్దేశంతోనే రుణమాఫీ తీసుకువచ్చిందన్నారు. పేదలకు, ఆపదలో ఉన్న వారికి తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. రానున్న రోజుల్లో వివిధ పథకాల కింద మరిన్ని ఎక్కువ నిధులు తీసుకువచ్చి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రుణమాఫీకి సంబంధించి రైతుల ఖాతాల్లో నిధులు జమకాక పోయినా, లేదా బ్యాంకరు పాత బాకీ కింద జమ చేసుకున్నా నేరుగా తనకు గానీ, కలెక్టర్‌కు గానీ ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. మరో వారం రోజుల్లో రూ.1.50లక్షల లోపు రుణాలు మాఫీ అవుతాయని, ఆ తర్వాత వారంలో రూ.2లక్షల వరకు మాఫీ అవుతాయన్నారు. ఆగస్టు చివరినాటికి ఈ ప్రక్రియను పూర్తిచేస్తామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, తరగతి గదుల నిర్మాణాన్ని రూ.60కోట్లతో చేపట్టామన్నారు. అన్ని పాఠశాలల్లో డిజిటల్ తరగతుల నిర్వహణకు సమాలోచన చేస్తున్నామన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం, బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు పూర్తికి గ్రీన్‌చానల్‌లో నిధులు ఉంచి 26 నెలల్లో పనులు పూర్తిచేసేలా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.1లక్ష లోపు రుణాలు ఉన్న రైతులందరికీ గురువారం వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అవుతాయని తెలిపారు. ఈ విషయమై బ్యాంకర్లతో సమావేశం కూడా నిర్వహించామన్నారు. రుణమాఫీ నగదును ఇతర రుణాల కింద జమచేయవద్దని స్పష్టం చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, వ్యవసాయశాఖ అధికారి పి.శ్రవణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది ఉంటే ఫోన్ చేయండి

ఏదైనా సాంకేతిక సమస్యతో రైతుల ఖాతాల్లో నిధులు జమకాకుంటే జిల్లా స్థాయిలో ఐదుగురు అధికారులతో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ సెల్ ఫోన్ నెంబర్ 7288800023లో రైతులు సంప్రదించాలన్నారు.



రుణమాఫీ వీడియోకాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న మంత్రి, కలెక్టర్, తదితరులు, రుణమాఫీ పొందిన రైతు కుటుంబం ఆనందం



ట్రాక్టర్ నడుపుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ధీమా లేని బీమా..
చేయూతనివ్వని 'త్రిఫ్ట్'

▸▸ 50 శాతం సబ్సిడీ అమలులో ఇబ్బందులు
▸▸ ఇంటిల్లిపాదీ చేస్తున్నా వర్తించని 'బీమా' ▸▸ ఎనిమిది నెలలుగా నిలిచిన త్రిఫ్ట్ చెల్లింపులు



చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలు ప్రకటిస్తున్నా అధికారుల మధ్య సమన్వయం కొరవడి క్షేత్రస్థాయిలో అవి కార్మికుల దరి చేరడంలేదు. చేనేత కార్మికులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్టు స్కీం వారికి భరోసా కల్పించలేకపోయింది. అసలు త్రిఫ్ట్ స్కీం ఉన్నట్టా, లేనట్టా? అనే సందేహాన్ని కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. చేనేత కార్మికులు క్రమం తప్పకుండా తమ వాటాధనం చెల్లిస్తున్నా ప్రభుత్వం నుంచి సహకారం కొరవడింది. ప్రభుత్వం రెండింతలు జమ చేసి ఆరు నెలలుగా రూ.15 కోట్ల మేరకు చెల్లించాల్సి ఉన్నా ఆ ఊసే లేదు. 11,099 మంది చేనేత కార్మికులు త్రిఫ్టు పథకంలో చేరగా, వారంతా డబ్బు కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

•7లో..

రైతుల ఖాతాల్లో రుణమాఫీ
జమచేయాలి

▸▸ సమస్యలుంటే కంట్రోల్ రూంను సంప్రదించాలి
▸▸ కలెక్టర్ నారాయణరెడ్డి ▸▸ 2024-25 వార్షిక రుణ ప్రణాళిక విడుదల



వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్, జూలై 18: రుణమాఫీ పథకం కింద రూ.1లక్ష రుణాలు రైతులందరి ఖాతాల్లో జమ చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి బ్యాంకర్లను కోరారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకర్లు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా సోమవారంలోగా రూ.1లక్ష రుణాలను మాఫీ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ నగదును ఇతర రుణాల కింద జమ చేయకూడదన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యలతో రైతులు బ్యాంకులకు వచ్చినప్పుడు వారికి సహాయం చేయాలని, అందుకు అన్ని బ్యాంకుల్లో నోడల్ అధికారులను నియమించాలన్నారు. లక్ష రూపాయలలోపు రుణమాఫీ పొందిన రైతులందరికీ బ్యాంకులు రుణాలను రెన్యువల్ చేయాలన్నారు. అందుకు సోమవారం నుంచి వారం రోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. పంట రుణమాఫీ సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే కంట్రోల్ రూమ్ నెంబర్ 7288800023కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సైతం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ మాట్లాడుతూ, లక్ష రూపాయలలోపు పంట రుణాలు పొందిన రైతులు జిల్లాలో 83,000 మంది ఉన్నారని, అందుకు ప్రభుత్వం రూ.453 కోట్లు వారి ఖాతాల్లో జమ చేయనున్నదన్నారు.రుణాలు పొందిన రైతుల జాబితాను ఇదివరకే బ్యాంకులకు పంపించామని,మండల వ్యవసాయ అధికారుల ద్వారా రైతులందరికీ సమాచారాన్ని అందజేశామన్నారు. ఎల్డీఎం శ్రామిక్ మాట్లాడుతూ, 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో రూ.6,479కోట్ల రుణ లక్ష్యానికి రూ.7,417కోట్లు రుణాలు ఇచ్చి 115శాతాన్ని లక్ష్యాన్ని సాధించామన్నారు. పంట రుణ లక్ష్యం 95శాతం సాధించామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ కింద 300 శాతం లక్ష్యం చేరామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సంఘాలకు రూ.260కోట్లు రుణంగా ఇచ్చి రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని అభినందించారు. అనంతరం రూ.15811.91కోట్ల అంచనాలతో రూపొందించిన 2024-25 జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ విడుదల చేశారు. సమావేశంలో పలు బ్యాంకుల నియంత్రణ అధికారులు, కో-ఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

దోచేసిన మై క్వీన్



▸▸ ఏడింతల చెల్లింపు పేరుతో బడా మోసం
▸▸ ఆశకుపోయి నష్టపోయిన బాధితులు
▸▸ సుమారు రూ.10కోట్లు కోల్పోయిన ఉమ్మడి జిల్లా వాసులు

పెట్టిన పెట్టుబడి మొత్తానికి స్వల్ప వ్యవధిలో ఏడింతలు చెల్లిస్తామని ఊరించి కోట్లాది రూపాయలను 'మై క్వీన్' సంస్థ కొల్లగొట్టింది. దీంతో బాధితులు ఎవ్వరికీ చెప్పుకోలేక... కోల్పోయిన మొత్తాన్ని రాబట్టుకునే అవకాశం లేక పూర్తిగా నష్టపోయారు. ఉమ్మడి జిల్లా అంతటా బాధితులు ఉన్నట్లు సమాచారం. ఆన్‌లైన్‌లో పెట్టుబడులు వద్దని పోలీసులు ప్రచారం చేస్తున్నా, సులభమార్గంలో భారీగా సంపాదించవచ్చని కొందరు ఆశకుపోయి ఆర్థిక కుంగుబాటుకు గురవుతున్నారు. చివరికి నష్టపోయి చేసేది లేక స్వయం కృతాపరాధమని లోలోన కుమిలుతున్నారు. 'మై క్వీన్' సంస్థ ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.10కోట్ల మేర మోసానికి పాల్పడటం సంచలనంగా మారింది.

- భువనగిరి టౌన్

పెట్టిన పెట్టుబడికి స్వల్ప వ్యవధిలో ఏడింతలు చెల్లిస్తామని ఆన్‌లైన్‌లో కొంత కాలంగా 'మై క్వీన్' మనీ సర్క్యులేషన్ స్కీం యాప్ హల్‌చల్ చేసింది. ఈ మేరకు మొదట్లో యాప్‌లో రూ.100 పెట్టుబడి పెట్టిన వారికి స్వల్ప వ్యవధిలో రూ.700 యాప్‌లో వ్యక్తిగత అకౌంట్‌లో జమచేసింది. క్రమంగా ఆ పెట్టుబడిని రూ.100 నుంచి వేలకు మరి కొంత కాలానికి లక్షలకు 'మై క్వీన్' పెంచింది. దీంతో ఆశపడిన పలువురు వారేగాక, వారి పరిచయస్థులు, బంధువులతో 'మై క్వీన్'లో పెట్టుబడులు పెట్టించడం ప్రారంభించారు. మొదట్లో అంతా సజావుగానే పెట్టిన పెట్టుబడితో నిమిత్తం లేకుండా ఏడింతలు వచ్చాయి. రూ.1లక్ష పెట్టుబడి పెట్టిన వారికి రూ.7లక్షలను 'మైక్వీన్' చెల్లించింది. ఈ క్రమంలో ఆశపెరిగిన పలువురు పెట్టుబడి మొత్తాన్ని లక్షలకు పెంచి లబ్ధి పొందారు. ఈ మేరకు జరిగిన విస్తృత ప్రచారంతో అన్ని వర్గాలు, రంగాలకు చెందిన స్త్రీ, పురుషులు వారి స్మార్ట్ ఫోన్లలో 'మై క్వీన్' యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. కొద్ది మందికి ఇదే వ్యాపకంగా మారగా, మరికొందరు పెట్టుబడిదారులకు గైడ్లుగా మారి లాభాల శాతంలో కమీషన్లను పొందారు. అంతా సజావుగా జరుగుతుందనుకుంటున్న క్రమంలో అకస్మాత్తుగా జూన్ చివరి వారంలో ఆన్‌లైన్‌లో 'మై క్వీన్' యాప్ కనుమరుగైంది. దీంతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టిన వారి గుండెలపై బండ వేసినట్లయింది. అయితే సాంకేతిక కారణాలతో యాప్ అందుబాటులోకి రావడం లేదనే ఆశాభావంతో పెట్టుబడులు పెట్టిన వారు కొద్ది రోజుల పాటు ప్రతి నిమిషం సెల్ ఫోన్లలో 'మై క్వీన్' యాప్‌ను వెతకడం లోనే నిమగ్నమయ్యారు. అయినప్పటి కీ యాప్ అందుబాటులోకి రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించారు. కానీ, స్వల్ప వ్యవధిలో భారీగా వెనకేసుకోవచ్చుననే ఆశతో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన వారు పరువు పోతుందని తదితర కారణాల తో ఎవ్వరికీ చెప్పుకోలేకపోతున్నట్లు ప్రచారం అవుతున్నది. కొద్ది మంది బాధితులు జరిగిన నష్టంపై పోలీసులను ఆశ్రయించగా, ఫిర్యాదులు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు పేర్కొంటుండడంతో బాధితులు గప్‌చుప్‌గా వెనక్కు మళ్లుతున్నట్లు తెలుస్తోంది.

ఆశే పెట్టుబడిగా..

సులభ మార్గంలో భారీగా సంపాదించుకోవచ్చుననే ప్రజల ఆశే పెట్టుబడిగా 'మై క్వీన్' యా ప్ నిలువునా దోచుకుంది. గుర్తు తెలియని ప్రాం తం నుంచి కార్యకలాపాలు నిర్వహించిన 'మై క్వీన్' యాప్ చెల్లింపులను మాత్రం చెన్నై కేంద్రంగా జరిపినట్టు బాధితులు పేర్కొంటున్నారు. ఈ మనీ సర్క్యులేషన్ స్కీంలో చేరిన వారికి యాప్ లింక్ పంపారు. సదరు వ్యక్తి మరికొంత మందిని చేర్పిస్తే కమిషన్లు కూడా వచ్చాయి. లింక్ షేర్ అయిన వెంటనే బ్యాంక్ అకౌంట్ వివరాలను అప్‌లోడ్ చేయాలని ప్రధాన కండీషన్. మొదట్లో రూ.100 పెట్టుబడి పెట్టిన వారికి 24 గంటల్లోనే రూ.700 జమయ్యాయి. దీంతో కొద్ది మంది యాప్ మూసివేతకు కొద్ది రోజుల ముందు లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టారు. వీరిలో కొద్ది మంది తక్కువ వడ్డీకి అప్పు తెచ్చారు. మరికొద్ది మంది బ్యాంక్‌లు, ప్రైవేట్ సంస్థల్లో బంగారంపై రుణాలు తీసుకొని పెట్టుబడు లు పెట్టారు. అల్పా ఆదాయ, సాధారణ, యువత, చిరువ్యాపారులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు లక్ష్యంగా రూ పొందించిన 'మై క్వీన్' యాప్‌లో మహిళలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు కూడా పెట్టుబడులు పెట్టి నష్టపోయినట్లు ప్రచారంలో ఉంది.

సుమారు రూ.10కోట్లకు టోపీ



ఉమ్మడి జిల్లాలో సుమారు ఐదు వేల మంది నుంచి దాదాపు రూ.10 కోట్లను 'మై క్వీన్' కాజేసినట్లు ప్రచారం అవుతోంది. నష్టపోయిన వారి లో రూ.100 నుంచి రూ.లక్షకు పైగా పెట్టుబడులు పెట్టిన వారు ఉన్న ట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని సుమారు అన్ని ప్రాంతాల్లో 'మై క్వీన్'లో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన వారు ఉన్నట్లు సమాచారం. భువనగిరి జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఏకంగా 15 మంది ఉద్యోగులు 'మై క్వీన్' యాప్‌లో పెట్టుబడులు పెట్టి లక్షలాది రూపాయలు నష్టపోయినట్లు తెలిసింది. అయితే పెట్టిన పెట్టుబడులు తిరిగి రాకపోవడంతో యాప్ లింక్‌ను షేర్ చేసిన సహచరులతో నష్టపోయిన ఉద్యోగులు తగదా పడ్డారు కూడా. అయితే ఈ యాప్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్‌కుమార్ తెలిపారు.

రుణమాఫీ జీవోను సవరించాలి : సీపీఎం

నకిరేకల్, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ బ్యాంకుల్లో జమ చేస్తున్నందున రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా జీవోను సవరించాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాళ ప్రమీళ అన్నారు. రుణమాఫీకి రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా జీవో సవరించాలని గురువారం నకిరేకల్ తహసీల్దార్ జమీరుద్దీన్‌కు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం జీవో 567ను వెంటనే సవరించాలని, 2018 డిసెంబరు గడువు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, ఆకుల భాస్కర్, యానాల వెంకట రంగారెడ్డి, బొడ్డుపల్లి లక్ష్మీనర్సయ్య, గాదగోని అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రూ.10లక్షలు పరిహారం ఇవ్వాలి

చింతపల్లి, జూలై 18: కిష్టరాయిన్‌పల్లి రిజర్వాయర్ నిర్మాణంతో నష్టపోతున్న తమకు రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని ఈదులగండికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు గ్రామంలో నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ, ప్రభుత్వాలు, అధికారులు మారినా, రిజర్వాయర్ కింద భూములు కోల్పోతున్న తమకు పరిహారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు విడతలుగా సర్వే నిర్వహించి కేవలం ఎకరాకు రూ.5లక్షలు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. భూములు కోల్పోయిన రైతుల జాబితాను క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఎకరాకు రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు దీక్షా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. దీంతో వారు దీక్ష విరమించారు. కార్యక్రమంలో రైతులు జంగయ్య, యాదగిరి, లింగస్వామి, భాస్కర్, నగేష్, శ్రీను, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.




కిష్టరాయిన్‌పల్లి గ్రామశివారులో ఈదులగండి వద్ద నిరాహార దీక్ష చేస్తున్న రైతులు

ఏళ్లు గడుస్తున్నా శిథిలావస్థలోనే కాల్వలు

ప్రతిపాదనలకే పరిమితమైన నిధుల కేటాయింపు

కాంగ్రెస్ హయాంలోనైనా మరమ్మతులు పూర్తయ్యేనా?

•7లో..



హైదరాబాద్ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై వీధికుక్కల దాడులు ఇటీవల పెరిగిపోయాయి. దీంతో జనం భయాందోళన గురవుతున్నారు. కుక్కకాటుకు గురవుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రతి రోజూ కనీసం 30 మంది వరకు కుక్కకాటు వ్యాక్సిన్ కోసం వస్తున్నారు. వీరందరికీ యాంటీరేబీస్ వ్యాక్సిన్ ఇస్తున్నారు. వీధికుక్కలతో పాటు ఇంట్లోని పెంపుడు కుక్కల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. కుక్కకాటుకు తక్షణమే యాంటి రేబీస్ వ్యాక్సిన్ వేయించకపోతే రేబీస్ వ్యాధి వచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కుక్క కాటు వేసిన వెంటనే సమీపంలోని వైద్యుల వద్దకు వెళ్లి వ్యాక్సినేషన్ చేయించుకోవాలని సూచిస్తున్నారు.

కుక్క కరిచిందా.. వ్యాక్సిన్ తప్పనిసరి

- సొంత వైద్యం, నాటు వైద్యం తగదు
- సాధారణ కాటుకు అయిదు డోసులు
- లోతు గాటు ఉంటే రేబిస్ వ్యాక్సిన్‌తో పాటు మరో అయిదు డోసులు



కాటుతోనే కాదు.. గాయాలపై లాలాజలం పడినా..

కుక్క లాలాజలంలో రేబీస్ వైరస్ కలిసి ఉంటుంది. కుక్క కాటుతోనే కాదు రేబీస్‌తో కూడిన లాలాజలం చేతిపై ఉన్న కత్తి గాటు, ఇతర గాట్లపై పడినా జబ్బు వచ్చే ముప్పు ఉంది. రేబీస్ ఉన్న కుక్క కరిస్తే వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి మూడు వారాల నుంచి మూడు నెలలో వెలుగుచూడవచ్చు. మరి కొందరిలో ఇందుకు రెండేళ్ల సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. కుక్క కరచిన చోట శరీరభాగం నుంచి రేబీస్ వైరస్ మెదడుకు వ్యాపించడానికి చాలా సమయం పడుతుందని, నరాల నుంచి మెదడకు అది నిశ్శబ్దంగా పాకుతుందని చెప్పారు. కరిచిన చోట కణజాలం పెరుగుతుంది. కరిచిన కుక్కను 10 రోజుల పాటు రోజూ గమనిస్తుండాలి. దాని ప్రవర్తను పరిశీలించాలి. ఆ 10రోజులు కుక్కకు ఏమీ కాకపోతే రేబీస్ వ్యాధి లేనట్లుగా భావించాలి. రేబీస్ వ్యాధి ఉన్న వారిలో హైడ్రోఫోబియా, ఫోటో ఫోబియా, ఎయిర్ ఫోబియా ఉంటాయి. ఉధృతమైన గాలి వీస్తే వారు భయపడుతుంటారు.

డోసు పూర్తిగా తీసుకోకపోతే

కుక్కకాటుకు వైద్యుల సలహా ప్రకారం పూర్తిస్థాయి డోస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే రేబీస్ వ్యాధిబారిన పడే ప్రమాదముందని, ఆ వ్యాధిబారిన పడితే బతకడం అసాధ్యమని వైద్యులు చెబుతున్నారు. కుక్క కరిచిన వెంటనే ఎలాంటి అశ్రద్ధ చేయకుండా వైద్యచికిత్సలు పొందాలని హెచ్చరిస్తున్నారు. పిచ్చికుక్క, వీధికుక్కలు కరిస్తే ప్రాణానికే ప్రమాదమని, పెంపుడు కుక్కలు కరిస్తే పెద్దప్రమాదం కానప్పటికీ వెంటనే వైద్యచికిత్సలు పొందాలని వైద్యులు సూచిస్తున్నారు. కుక్క కరిచినప్పుడు ఆ గాయాన్ని శుభ్రం చేసి అయిట్‌మెంట్ పెట్టి ఓపెన్‌గా పెడితే తగ్గుతుందని, గట్టిగా కట్టు కటినట్లు గాలి ఆడకుండా చేయవద్దంటున్నారు.

రేబీస్ వైరస్ సోకిన వారి లక్షణాలు..

రేబీస్ ఉన్న కుక్కల నోటి నుంచి లాలాజలం కారుతుంటుంది. మనుషులకు సాధారణంగా ఒక వైపు నుంచి సొంగ కారుతుంది, కానీ రేబీస్ వ్యాధి ఉన్న వారిలో రెండు వైపుల నుంచి లాలా జలం స్రవిస్తుంది. రేబీస్ ఉన్న వ్యక్తుల మనసత్వం ఇరిటేషన్‌గా ఉంటుంది. కొన్నిసార్లు పిచ్చిగా వ్యవహరిస్తుంటారు. కుక్క కరిచిన వారిలో భయం ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● ఇంజెక్షన్లు గుర్తింపు పొందిన మందుల దుకాణంలో తీసుకోవాలి. ● వాటిని 24 గంటల పాటు ఫ్రీజ్‌లో ఉంచాలి. ● ఫ్రీజ్ నుంచి తీసిన ఇంజెక్షన్లు వాటి ప్రభావం కోల్పోకుండా నిర్ణిత ఉష్ణోగ్రతలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ● కుక్క కరిచిన వెంటనే చికిత్స మొదలుపెట్టాలి. ● కొన్నిసార్లు ఆలస్యమైనప్పటికీ వైద్యుడిని సంప్రందించి సలహాలు తీసుకోవాలి.


అయిదు డోసుల వ్యాక్సిన్



కుక్కకాటుకు గురైన వారికి యాంటీరెబీస్ వ్యాక్సిన్(ఏఆర్వీ), రేబీస్ ఇమ్యూనోగ్లాబులిన్(రిగ్)వ్యాక్సిన్‌లను ఇవ్వాలి. ఎఆర్వీ ఐదు డోస్‌లు, రిగ్ నాలుగు డోస్‌లు తీసుకోవాలి. ముందుగా టెస్ట్‌డోస్ ఇచ్చి అరగంట నుంచి 45 నిమిషాల పాటు అబ్జర్వేషన్ చేసి ఆ డోస్ పడితే వారికి మెయిన్‌డోస్ ఇస్తారు. కుక్కకాటు వల్ల శరీరం పైపై భాగంలో గీరుకుపోయినట్లు, కొంచెం కాటు ఉంటే అలాంటి వారికి అయిదు డోసుల యాంటీరెబీస్ వ్యాక్సిన్ తప్పనిసరి. ఈ వ్యాక్సిన్లకు ముందుగా టీటీ ఇవ్వాల్సి ఉంటుంది. తర్వాత వైద్యుల సలహా ప్రకారం మొదటి రోజు, 3వ రోజు, 7వ రోజు, 14వ రోజు 28వ రోజు చొప్పున ఇవ్వాల్సి ఉంటుంది. లోతుగా కుక్కకాటు గాటు పడితే టీటీ ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత రేబీస్ ఇమ్యూనోగ్లాబులిన్, తర్వాత అయిదు డోసుల యాంటీరెబీస్ వ్యాక్సిన్ ఇవ్వాలి. కరిచిన కుక్కకు వ్యాక్సిన్ వేశారా? లేదా? దానికి రాబీస్ ఉందా లేదా? అనేది అవగాహన లేకపోతే ముందు జాగ్రత్తగా రేబీస్ వ్యాక్సిన్ వేసుకోవడం ఉత్తమం. కుక్కకాటుకు వ్యాక్సిన్ 95 శాతం వరకు పనిచేస్తుందని, అయిదు శాతం మాత్రమే రిస్క్ ఉంటుంది. బాధితులు తప్పనసరిగ్గా పూర్తిస్థాయి డోస్ వ్యాక్సిన్ తీసుకోవాలి.

● డాక్టర్ సందీప్ ఘంటా, సీనియర్ ఇంటర్నల్ మెడిసిన్, స్టార్ ఆస్పత్రి

నెరవేరని ఏఎమ్మార్పీ లక్ష్యం



- ఏళ్లు గడుస్తున్నా శిథిలావస్థలోనే కాల్వలు
- ప్రతిపాదనలకే పరిమితమైన నిధుల కేటాయింపు
- కాంగ్రెస్ హయాంలోనైనా మరమ్మతులు పూర్తయ్యేనా?
- పనులు చేపట్టాలని వేడుకుంటున్న ఆయకట్టు రైతులు

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు

దేవరకొండ, జూలై 18 : నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్ల పల్లి మండలంలో నిర్మించిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు(ఏఎమార్పీ) లక్ష్యం నెరవేరడం లేదు. నల్లగొండ జిల్లాలోని 2.20లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంట నగరాలతో పాటు జిల్లాలోని 516 గ్రామాలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా 2001లో ఏఎమ్మార్పీ ప్రాజెక్టును ప్రారంభించారు. నాలుగు మోటార్ల ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో పాటు ప్రాజెక్టు పరిధిలోని 90చెరువులను నింపడం, హైదరాబాద్ జంటనగరాలతో పాటు జిల్లాకు తాగునీరు అందించడమే లక్ష్యంగా నిర్దేశించారు. జిల్లాలోని దేవరకొండ, నాగార్జునసాగర్, నల్లగొండ, నకిరేకల్ నాలుగు నియోజకవర్గాల్లో ఈ ప్రాజెక్టు విస్తరించి ఉంది. ప్రాజెక్టు ప్రధాన కాల్వకు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. 136 కిలోమీటర్లు ఉన్న ప్రధానకాల్వ కంపచెట్లతో నిండిపోయింది. ఈ ప్రాజెక్టు నుంచి తాగునీటికే తప్ప ఆయకట్టులో రెండు పంటలకు పూర్తిస్థాయిలో నీటిని అందించిన పరిస్థితులు లేవు.నాగార్జునసాగర్ జలాశయంలో నీరు డెడ్‌స్టోరేజీకి దిగువకు ఉండటం, ఏఎమ్మార్పీ సిస్టర్న్‌తో పాటు మోటార్లు తరచుగా మరమ్మతులకు గురికావడంతో ఆయకట్టుకు నీటిని విడుదల చేయలేకపోయారు. సాగర్‌లో నీరు ఉన్నప్పుడు ఒక పంటకు నీరు వదిలారు. అంతేకాక ఆరుతడులకు కూడా విడుదలచేశారు. ఏఎమ్మార్పీ ప్రధానకాల్వతో పాటు డిస్ట్రిబ్యూటరీలు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి శిథిలావస్థకు చేరుకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అధికారులు కంపచెట్ల తొలగింపు, మరమ్మతులకు రూ.కోటి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీశైలం సొరంగమార్గం, డిండి, పెండ్లిపాకల, నక్కలగండి, ఎస్ఎల్‌బీసీ, ప్రాజెక్టుల నిర్మాణంపై దృష్టి సారించింది. ఎస్ఎల్‌బీసీ సొరంగం, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులకు రూ.2వేల కోట్లు కేటాయించి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టింది.



మరమ్మతులకు నోచుకోక ఆనవాళ్లు కోల్పోతున్న ఏఎమ్మార్పీ కాల్వలు

ఏఎమ్మార్పీ కాల్వలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి



కొన్నేళ్లుగా ఏఎమ్మార్పీ కాల్వల్లో కంపచెట్లు పెరిగి శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం.కానీ సాగునీరు అందని పరిస్థితి నెలకొంది.

- రమావత్ బాబునాయక్,ఎర్రగుంటతండా,పీఏపల్లి మండలం.

ఏఎమ్మార్పీ ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి



శ్రీశైలం సొరంగమార్గం, డిండి ప్రాజెక్టు మాదిరిగానే ఏఎమ్మార్పీ ప్రాజెక్టుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రూ. 200 కోట్లు కేటాయించి శిథిలావస్థలో ఉన్న కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి. కంపచెట్లు తొలగించాలి. 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్న ప్రాజెక్టు ప్రస్తుతం సీజన్‌కు నీరు అందించలేని పరిస్థితి ఉంది.

- ఆనంద్, రైతు సంఘం నాయకుడు, అజ్మాపురం

రూ.150 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం

ఏఎమ్మార్పీ కాల్వల మరమ్మతులకు రూ.150 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలో కాల్వల చుట్టూ ఉన్న కంపచెట్లు తొలగించి మరమ్మతులు చేపడతాం. రైతులకు సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

- సత్యనారాయణ, డివిజన్ 4 ఈఈ, ఏఎమ్మార్పీ

రూ.200కోట్లు కేటాయిస్తే

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు కాల్వల మరమ్మతులు, కంపచెట్లు తొలగింపునకు రూ.200 కోట్లు కేటాయించాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపినా ఫలితం లేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో మూడు నెలల క్రితం ఏఎమ్మార్పీ అధికారులు రూ.150కోట్ల అంచనా వ్యయంతో కాల్వల మరమ్మతులు, కంపచెట్లు తొలగింపు పనులకు ప్రతిపాదనలు పంపారు. ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ప్రధానకాల్వ ప్రాజెక్టు నుంచి ఉదయసముద్రం వరకు 135కిలోమీటర్లు ఉంది. 60కి పైగా మేజర్ కాల్వలు ఉన్నాయి. వీటి నిర్వహణ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కాల్వలకు శిథిలావస్థకు చేరాయి. డిస్ట్రిబ్యూటరీలు కొన్నేళ్లుగా కంపచెట్లు పెరిగి ఆనవాళ్లు కోల్పోయే దుస్థితి నెలకొంది. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో నీరు డెడ్ స్టోరేజీకి దిగువకు ఉండటంతో ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ద్వారా నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో 10ఎమ రైన్సీ మోటార్లు బిగించి హైదరాబాద్ జంట నగరాలకు ప్రతీరోజు 525 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని గ్రామాలకు 45 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. వానాకాలం ప్రారంభమైనందున వర్షాలు సమృద్ధిగా కురిస్తే శ్రీశైలం ప్రాజెక్టు నిండితే నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి నీరు చేరుతుంది. ఈ వ్యవసాయ సీజన్‌పై ఆయకట్టు రైతులు ఆశలు వదులుకున్నారు. ఏఎమ్మార్పీ ఆయకట్టు రైతులు సాగునీరు అందకపోవడంతో వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు మునగ, కూరగాయలు, దొండ తోటల సాగుపై దృష్టి సారించారు. ఏఎమ్మార్పీ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి శిథిలావస్థకు చేరుకున్న కాల్వలకు మరమ్మతులు నిర్వహించి, కంపచెట్లను తొలగించి నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కాల్వల్లో చెట్లు, పిచ్చిమొక్కలు

జ్వరం గుప్పిట్లో రఘునాథపాలెం

- గ్రామంలో 100మందికి పైగా బాధితులు
- 15రోజులుగా కొనసాగుతున్న వైద్యశిబిరం

మఠంపల్లి, జూలై 18: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామస్థులు జ్వరంతో బాధపడుతున్నారు. ప్రతీ వీధికి ఒకరు చొప్పున జ్వరబాధితులు ఉండగా, నెల రోజుల్లో 100 మందికి పైగా జ్వరం, అతిసారతో ఆసుపత్రుల పాలయ్యారు. గ్రామస్థుల తెలిపిన ప్రకారం జ్వర పీడితుల్లో ఇప్పటికే ఐదుగురు మృతి చెందారు. 90మందికి పైగా సమీప పట్టణాల్లోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇద్దరు మృతి చెందాక గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. 5000 మంది జనాభా ఉన్న రఘునాథపాలెంలో నెల రోజుల కిందట 10 మంది జ్వరం బారిన పడ్డారు. వరుసగా జ్వర బాధితులు పెరుగుతుండటంతో స్థానిక ప్రభుత్వ వైద్యాధికారికి సమాచారం అందించారు. బాధితులు స్థానికంగా చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లారు. బాధితుల క్రమంగా పెరుగుతూ 100మందికి పైగా చేరుకుంది. వృద్ధులు, మహిళలు, చిన్నారులు సైతం విషజ్వరాలతో బాధపడుతున్నారు. జ్వరం, విరోచనాలు, వాంతులతో 15 రోజుల్లో ఐదుగురు చనిపోయిన దాఖలాలు ఉన్నాయి. అందులో ఖమ్మంలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురు గ్రామంలోనే మృతి చెందారు. ఇదిలా ఉంటే పరిస్థితి విషమిస్తుండటంతో సూర్యాపేట డీఎంహెచ్‌వో కోటా చలంకు గ్రామస్థులు ఫోన్‌లో తమ ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ఆయన ఆదేశాల మేరకు మండల వైద్యాధికారి సుధాకర్‌నాయక్ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. మఠంపల్లి పీహెచ్‌సీ, రఘునాథపాలెం హెల్త్‌సెంటర్ ఆశా వర్కర్, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలతో 10 మందితో కూడిన మూడు బృందాలను ఏర్పా టుచేసి స్థానికంగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. రాత్రి వేళ ఇబ్బందులు ఎదురైతే స్థానికంగా ఉండే ఏఎన్ఎం, ఆశా వర్కర్ సేవలు అందిస్తున్నారు. అతిసార లక్షణాలతో చనిపోతున్నారని గ్రామస్థులు భయందోళనకు గురవుతున్నారు. అయితే, గ్రామంలో అతిసార లక్షణాలు లేవని, వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారులు సూచిస్తూ గ్రామంలో అవగాహన కల్పిస్తున్నారు. పారిశుధ్య లోపంతో దోమల ఉధృతి పెరిగి విషజ్వరాలు ప్రబలడానికి కారణమని వైద్యసిబ్బంది తెలిపారు.





ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రఘునాథపాలెం గ్రామస్థులు బొబ్బ పిచ్చిరెడ్డి, దేవరకొండ గాలిబ్

అధ్వానంగా మురుగుకాల్వలు, కాలనీలు

గ్రామంలో అనేక వీధుల్లో మురుగుకాల్వలు అధ్వానంగా మారాయి. మురుగు నీటి నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడమే కాక దోమల వ్యాప్తి పెరిగింది. పలు కాలనీల్లో రోడ్లు సరిగా లేక మురుగునీరు నిల్వ ఉండి కనీసం నడిచే వీలులేకుండా పోయింది. కాల్వలు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు ప్రవహించక దుర్వాసన వస్తోంది.

మూడు వారాల్లో ఐదుగురి మృతి



మూడు వారాల్లో ఐదుగురు మృతి చెందగా, అతిసార లక్షణాలే కారణమని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. గ్రామంలో సరఫరా అవుతున్న నీటిని ల్యాబ్‌కు పంపించి లోపాలను గుర్తించాలి. గ్రామాన్ని జిల్లా అధికారులు సందర్శించి, జ్వరంతో బాధపడతున్న వారి కోసం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి వైద్యం అందించాలి. అతిసార లక్షణాలను అవగాహన కల్పిస్తూ ప్రజలకు వివరించాలి.

-బొబ్బ రవీందర్‌రెడ్డి, రఘునాథపాలెం, గ్రామస్థుడు

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



గ్రామంలో మురుగునీరు, పారిశుధ్యం నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలి. దోమలు ప్రబలకుండా మందులను పిచికారీ చేయాలి. పైప్‌లైన్లు, రోడ్లపై మురుగు నీరు నిల్వ లేకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా పం చాయతీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి. గ్రామంలో ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే ద్వారా జ్వరం బారిన పడిన వారిని గుర్తించి వైద్యం అందించాలి.

-మాఘం నర్సింహారావు, రఘునాథపాలెం, గ్రామస్థుడు

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్న విషయం వాస్తవమే. పక్షం రోజులుగా గ్రామంలో సిబ్బంది ద్వారా పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. గ్రామంలో ఇంటింటి సర్వే ద్వారా జ్వరపీడితులకు రక్త నమూనాలు సేకరిస్తున్నాం. సకాలంలో వైద్య చికిత్స అందిస్తున్నాం. గ్రామంలోని రామాలయ, ఎస్సీ కాలనీలలో సర్వే చేయగా పలువురిరి నీళ్ల విరేచనాలతో బాధపడుతున్నట్లు గుర్తించాం. ఇది కూడా పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, తాగునీరు సరిగా లేకపోవడమే కారణం. సర్వే చేసిన ఇళ్లలో అతిసార వ్యాధి లక్షణాలు లేవు. అతిసార లక్షణాలతో ఎవరూ చనిపోలేదు. వ్యాధిగ్రస్థులు, ఇతర ఏమైనా లక్షణాలు ఉంటే వైద్య ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

-సుధాకర్‌నాయక్, మఠంపల్లి మండల వైద్యాధికారి

గరిడేపల్లిలో దొంగల హల్‌చల్

- తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు

గరిడేపల్లి, జూలై 18: తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని గుర్తు తెలియని వ్యక్తులు మూడిళ్లలో దొంగతనానికి పాల్పడ్డారు. పక్కింటి వాళ్లు గొడవ చేస్తారనే భయంతో వారి తలుపులకు గడియపెట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ ఈట సైదులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని యనమదల రామచందర్‌రావు కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వారం రోజుల క్రితం బెంగుళూరులోని తన కుమార్తె ఇంటికి వెళ్లారు. అదే వీధిలో ఖాజామొయినుద్దీన్ కుటుంబసభ్యులతో కలిసి మొహర్రం పండుగ కోసం కోదాడకు వెళ్లారు. ఈ రెండు ఇళ్లకు సమీపంలోనే మరో వీధిలో ఉన్న సత్యనారాయణరెడ్డి కుటుంబం హైదరాబాద్ వెళ్లింది. దీంతో వారు తమ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. ఈ మూడిళ్లను దొంగలు టార్గెట్ చేశారు. తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. శబ్ధం వినపడితే పక్కింటి వాళ్లు లేస్తారనే భయంతో వారి ఇళ్లకు గడియ పెట్టి దొంగతనం చేశారు. రామచందర్‌రావు ఇంట్లో సుమారు రూ.2.10లక్షల నగదు, ఖాజామొయినుద్దీన్ ఇంట్లో తులం బంగారం, సత్యనారాయణరెడ్డి ఇంట్లో రూ.3వేల నగదును తస్కరించినట్లు బాధితులు తెలిపారు. అర్ధరాత్రి ఇద్దరు అంగంతకులు తచ్చాడుతుండగా చూసిన వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వారి కోసం వెతికినా వారు దొరకలేదు. అప్పటికే దొంగతనం చేసి పోలీసులు సైరన్ మోగడంతో పరారై ఉంటారని, గ్రామస్థులు అ నుమానిస్తున్నారు. చోరీ విషయాన్ని తెలుసుకున్న హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్ఐ ఈట సైదులు గురువారం ఉదయం క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలను సేకరించారు. ఈ సందర్భంగా సీఐ చరమందరాజు మాట్లాడుతూ గ్రామంలో కొత్త వ్యక్తులు కనిపించినా, ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే 100కు కాల్ చే యాలని అన్నారు. ఊర్లకు వెళ్లేవారు పోలీస్‌స్టేషన్లో సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలకు సూచించారు.



చిందరవందరగా పడేసిన వస్తువులు

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పెద్దవూర, జూలై 18: అనుమానాస్పద స్థితిలో గిరిజన వివాహిత మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని వై జంక్షన్ సమీపంలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం... పెద్దవూర మండలంలోని రామన్నగూడెం తండాకు చెందిన బనావత్ నానుకి (55) ముప్పై సంవత్సరాల క్రితం పెద్దవూరకు వచ్చి నివాసం ఉంటోంది. ఆమె ఇంట్లో మస్తాన్ అనే వ్యక్తి రెండు నెలలుగా కిరాయికి ఉంటూ మిర్చి వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపార నిమిత్తం గురువారం బయటకు వెళ్లిన మస్తాన్ మధ్యాహ్నం ఇంటి వచ్చే వరకు నానుకి అనుమానాస్పద స్థితిలో కనిపించింది. వెంటనే ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పెద్దవూర ఎస్ఐ వీరబాబు సంఘటనా స్థలానికి చేసుకొని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ బీసన్నలు సంఘటన స్థలానికి వచ్చి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో వచ్చి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. నానుకి భర్తకు దూరంగా ఉంటోంది. ఆమెకు కుమార్తె ఉండగా ఆమెకు వివాహం కాగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ మహిళ మృతికి ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహంపై ఎటువంటి గాయాలు లేవని తెలిపారు. అంతేకాక మహిళపై ఉన్న బంగారం, నగలు అపహరణకు గురికాలేదన్నారు. మృతికి గల కారణాలను సాగర్ సీఐ బీసన్న ఆధ్వర్యంలో ఎస్ఐ వీరబాబు దర్యాప్తు చేస్తారని తెలిపారు.



నానుకి (ఫైల్ ఫొటో)

కుక్కల దాడిలో గొర్రెలకు గాయాలు

తిరుమలగిరి(సాగర్), జూలై 18: వీధి కుక్కల దాడిలో గొర్రెలు గాయాలపాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లాలోని తిరుమలగిరి (సాగర్) మండలంలోని కొంపెల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కొంపెల్లి గ్రామానికి చెందిన సత్రశాల రాజయ్య మూడు గొర్రెలు గాయాలపాలయ్యాయి. ఈ సందర్భంగా బాధితుడు రాజయ్యతో పాటు గ్రామస్థులు మాట్లాడుతూ కొద్ది నెలలుగా గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని అన్నారు. మనుషులతో పాటు, మూగ జీవాలపై విచక్షణ రహితంగా దాడులు చేస్తున్నాయని వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు గ్రామ పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

15 నిమిషాల్లో 150 సమాధానాలు

- మిర్యాలగూడకు చెందిన బుడతడి ఘనత
- వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

మిర్యాలగూడ టౌన్, జూలై 18: అతడో బుడతడు ముచ్చటగా మూడేళ్ల నిండేసరికి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఓరుగంటి రేయాన్ష్. అశోక్‌నగర్‌కు చెందిన ఓరుగంటి పవన్-రూపారేణుకల కుమారుడైన రేయాన్ష్ చిన్నతనం నుంచే అద్భుతాలు చేస్తున్నాడు. ముద్దుముద్దు మాటలు వచ్చీ రావడంతోనే అందరినీ ఆశ్చర్యపరిచేలా వస్తువులు, జంతువులను గుర్తుపట్టి పేర్లు చెప్పేస్తున్నాడు. రేయాన్ష్ వస్తువులు, జంతువులు తదితర అన్నింటి పేర్లను టకాటకా చెప్పేస్తుండటంతో వీడియో తీ సి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీకి పంపగా ఎంపికైనట్లు తెలిపారు. జనరల్ నాలెడ్జికి సంబంధించి 15 నిమిషాలలో 150కి పైగా సమాధానాలు చెప్పడంతో పాటు జాతీయ చిహ్నాలు, అంతరిక్షంలోని గ్రహాల పేర్లూ అలవోకగా చెప్పడంతో ఈ ఘనత సాధించాడన్నారు. పిన్నవయసులోనే వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకెక్కిన రేయాన్ష్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి అభినందించారు.



రేయాన్ష్‌ను అభినందిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అన్నింటి పేర్లు అలవోకగా

జంతువులు, పక్షుల పేర్లతో పాటు మరికొన్ని దేశాల పేర్లు టకటకా చెప్పడంతో తమ కుమారుడు వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందాడని రేయాన్ష్ తండ్రి ఓరుగంటి పవన్ తెలిపారు. కాగా పిన్నవయసులోనే వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకెక్కిన రేయాన్ష్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి అభినందించడంతో పాటు మెడల్, సర్టిఫికెట్ అందజేశారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

- తొలి రోజు పరీక్షలకు 370 మందికి 314 మంది హాజరు

నల్లగొండ, జూలై 18: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆగస్టు 5వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగనుండగా, తొలిరోజు 370 మందికి 314మంది పరీక్షరాశారు. నల్లగొండ పట్టణంలోని ఎస్పీఆర్ పాఠశాలలో ఉదయం వేళ (9 నుంచి 11.30 గంటల వరకు) సోషల్, ఫిజిక్స్ స్కూల్ అసిస్టెంట్ పరీక్షలకు మొత్తం 185 మందికి గాను 154 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం వేళ (2 నుంచి 4.30 గంటల వరకు) జరిగిన పీఈటీ స్కూల్ అసిస్టెంట్ పరీక్షకు సంబంధించి 185మంది అభ్యర్థులకు గాను 160మంది హాజరయ్యారు. తొలిరోజు పరీక్షలకు 370మందికి 56మంది గైర్హాజరయ్యారు. డీఎస్సీ పరీక్షల సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు ఎస్పీఆర్ పాఠశాలలో పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 (144 సెక్షన్) అమలులో ఉండనుంది.

పరీక్షకు పటిష్ఠ బందోబస్తు : ఎస్పీ

నల్లగొండ క్రైం: డీఎస్సీ పరీక్షల సందర్భంగా అన్నిరకాల భద్రత, పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. నల్లగొండ పట్టణంలోని ఎస్పీఆర్ పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద ఈ నెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో సభలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించకూడదని ఆయన అన్నారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో 500 మీటర్ల లోపు జీరాక్స్ షాపులు తెరిచి ఉండరాదని సూచించారు.

ధీమా లేని బీమా.. చేయూతనివ్వని 'త్రిఫ్ట్'

- ఎన్ని పథకాలున్నా కానరాని సంక్షేమం
- ఇంటిల్లిపాదీ చేస్తున్నా వర్తించని 'బీమా'
- ఎనిమిది నెలలుగా నిలిచిన త్రిఫ్ట్ చెల్లింపులు

'దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదు' అన్న చందంగా మారింది చేనేత సంక్షేమ పథకాల అమలు తీరు. ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి అనేక పథకాలు ప్రకటిస్తున్నా.. అధికారుల మధ్య సమన్వయం కొరవడి క్షేత్రస్థాయిలో ఆ పథకాలు కార్మికుల దరి చేరడంలేదు. దీంతో కార్మికుల్లో నిరాశ, నిస్పృహలు అలుముకున్నాయి. అదేవిధంగా ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరడం లేదు. నేతన్నలకు ఆర్థికంగా చేయూత అందించేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్టు స్కీం వారికి భరోసా కల్పించలేదు. గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిందే తప్ప ఆచరణలో పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయింది.

● భూదాన్‌పోచంపల్లి

త్రిఫ్ట్ స్కీం ఉన్నట్టా, లేనట్టా? అన్న సందేహాన్ని కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. చేనేత కార్మికులు క్రమం తప్పకుండా తమ వాటాధనం చెల్లిస్తున్నా ప్రభుత్వం నుంచి సహకారం కొరవడింది. ప్రభుత్వం రెండింతలు జమ చేసి ఆరు నెలలుగా రూ.15 కోట్ల మేరకు చెల్లించాల్సి ఉన్నా ఆ ఊసే లేదు. జిల్లాలోని 11,099 మంది చేనేత కార్మికులు త్రిఫ్టు పథకంలో చేరగా వారంతా డబ్బుల కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

కార్మికులు, ప్రభుత్వ వాటా ధనం ఇలా

చేనేత కార్మికులను ఆర్థికంగా ఆదుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 2017 జూన్ 24న భూదాన్ పోచంపల్లిలో త్రిఫ్ట్ పథకాన్ని ప్రారంభించింది. కార్మికులు తమ వేతనం నుంచి 8 శాతం వాటాను రికరింగ్ డిపాజిట్(ఆర్‌డీ) అకౌంట్-1లో జమచేస్తే ప్రభుత్వం ఆ మొత్తాన్ని రెండింతలు అనగా 16 శాతం మ్యాచింగ్ గ్రాంట్‌ను కార్మికుడి ఖాతాలో జమచేస్తుంది. కార్మికుడు పనిచేసిన నెల వేతనం నుంచి గరిష్ఠంగా రూ.12వేలు, అనుబంధ కార్మికులు రూ.800, రూ.600 చొప్పున బ్యాంకులో జమచేసుకోవచ్చు. మూడేళ్ల తర్వాత జమచేసిన మొత్తాన్ని కార్మికుడు డ్రా చేసుకోవచ్చు. అదేవిధంగా మరమగ్గాలకైతే కార్మికులు గరిష్ఠంగా నెలకు రూ.1000, అనుబంధ కార్మికుడు రూ.600 జమ చేస్తే ప్రభుత్వం అంతే మొత్తంలో ఆర్‌డీ-2 ఖాతాలో జమచేస్తుంది. కాగా లబ్ధిదారులకు 8 నెలలుగా డబ్బులు రావడం లేదు.

బీమా వర్తింపేదీ?

చేనేత కార్మికుడు మరణిస్తే బున్‌కర్ యోజన పథకం కింద ఆర్థికసాయం లభించేది. కొన్నిసార్లు ఆపద్బంధు కింద ఆర్థికసాయం అందజేసేవారు. వీటితో పాటు ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్షాబీమా యోజనా పథకాలున్నా అవి ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూర్చడం లేదు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది చేనేత, పవర్‌లూం కార్మికులు ఉన్నారు. సహకార, సహకారేతర రంగాల్లోని ప్రతి ఒక్కరికీ బీమా వర్తింపచేయాలని కోరుతున్నారు.

జియో ట్యాగింగ్‌తో..

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు మగ్గాల జియోట్యాగింగ్‌ను ప్రామాణికంగా తీసుకుంటోంది. ప్రధానంగా నేతన్నకు చేయూత (త్రిఫ్ట్) పథకాన్ని జియోట్యాగింగ్ కలిగిన వారికే వర్తింపజేస్తోంది. అలాకాకుండా వృత్తితో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ చేనేత బీమా వర్తింపచేసేలా పథకాన్ని రూపకల్పన చేయాలని కార్మికులు కోరుతున్నారు.



చేనేత వార్పు సాపుతున్న నేత కార్మికులు

చేనేత చెదలు 3

రూ.15 కోట్ల మేర బకాయిలు

జిల్లాలో జియోట్యాగింగ్ కలిగిన మగ్గాలు 6,070 ఉన్నాయి. వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు మొత్తం 11,099 మంది త్రిఫ్ట్ పథకంలో చేరారు. వీరందరూ నెలకు సుమారు రూ.కోటి 80 లక్షలకు పైగా తమ ఖాతాల్లో జమ చేస్తున్నారు. ప్రభుత్వం రెండింతలుగా జమచేసి ఎనిమిది నెలలుగా రూ.15 కోట్ల మేరకు చెల్లించాల్సి ఉంది. వీరికి 2023 అక్టోబరు నెల నుంచి డబ్బులు రావడం లేదు. అదేవిధంగా జిల్లాలో చేనేత కార్మికులతో పాటు మరో 1,011 మంది పవర్ లూమ్ కార్మికులు త్రిఫ్ట్ పథకంలో చేరారు. వీరికి కూడా సుమారు రూ.45 లక్షల మేరకు బకాయిలు జమ చేయాల్సి ఉంది.

అందని నూలు సబ్సిడీ

కేంద్ర ప్రభుత్వం నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌హెచ్‌డీసీ) ద్వారా నూలుపై 10శాతం సబ్సిడీ అందజేస్తోంది. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం నూలు, ముడి సరుకులపై 40శాతం రాయితీ ఇస్తూ మొత్తంగా 50శాతం సబ్సిడీ కల్పిస్తామని ప్రకటించింది. ఇందు కోసం బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించింది. కానీ ఈ పథకం అమలులో ఇబ్బందులు కార్మికులకు శాపంగా మారాయి.కార్మికుడు కొనుగోలు చేసిన నూలుపై సబ్సిడీ డబ్బులు ఖాతాలో జమ కావాలంటే కనీసం రెండు, మూడు నెలలు పడుతోంది. దీంతో చేనేత కార్మికులు నానాటికీ పెరిగిపోతున్న నూలు ధరలకు మగ్గం నేసేందుకే జంకుతున్నారు. నేరుగా తమ ఖాతాల్లోకి సబ్సిడీ పడాలని డిమాండ్ చేస్తున్నారు.

గత డిసెంబరు నుంచి డబ్బులు జమ కాలేదు



మా కుటుంబానికి మగ్గమే జీవనాధారం. నేను, నా భార్య మగ్గం నేస్తాం. వచ్చిన ఆదాయంలో ఇద్దరం ప్రతి నెలా రూ.2,400 చొప్పున రెండేళ్లుగా త్రిఫ్ట్ కట్టుకుంటున్నాం. నవంబరు వరకు డబ్బులు జమయ్యాయి. డిసెంబరు నుంచి జమచేయలేదు. ప్రతినెలా త్రిఫ్ట్ డబ్బులు జమచేయాలి. అవసరమైనప్పుడు డ్రా చేసుకునేట్లు సదుపాయం కల్పించాలి.

గుండు ప్రవీణ్, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి


చేనేత కార్మికులను ఆదుకోవాలి



గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించాలి. ఆరు నెలలుగా త్రిఫ్ట్ పథకం డబ్బులు రాలేదు. ఒక్క పోచంపల్లిలోనే 2,500 మంది ఈ పథకంలో డబ్బులు కట్టారు. నేను, నా కుమారుడికి కలిపి నెలకు రూ.2వేలు చెల్లిస్తున్నా. యారన్ సబ్సిడీ వస్తలేదు. ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

- కర్నాటి పురుషోత్తం, చేనేత జనసమాఖ్య యాదాద్రి జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వానికి జాబితా పంపించాం



గత ఏడాది సెప్టెంబరు వరకు త్రిఫ్ట్ డబ్బులు ఇచ్చాం. తొమ్మిది నెలల నుంచి బకాయిలు సుమారు రూ.15 కోట్ల మేర ఉన్నాయని ప్రభుత్వానికి నివేదించాం. అయితే వారం రోజుల్లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

- విద్యాసాగర్, ఏడీ, యాదాద్రిభువనగిరి జిల్లా చేనేత,జౌళీశాఖ

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం



దేవరకొండలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

- ఎమ్మెల్యేలు బాలునాయక్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి
- జిల్లాలో ఘనంగా రుణమాఫీ సంబురాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఎన్నికల హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీని అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని అన్ని మండలాల్లోని రైతువేదికల వద్ద రుణమాఫీ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు కాంగ్రెస్ నాయకుల తో కలిసి క్షీరాభిషేకం చేశారు. దేవరకొండ, చిట్యాలలో ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతువేదిక వద్ద టెలికాన్ఫరెన్స్‌లో సీఎం సందేశాన్ని రైతులకు వినిపించారు. అనంతరం ఎమ్మెల్యేలు, నాయకులు మాట్లాడుతూ చరిత్రలో కనీవినీ ఎరగని రీతిలో ఏకకాలంలో రూ. 31 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేయడం గొప్ప విషయమన్నారు. లక్ష రూపాయలు ఉన్న రైతులకు రుణమాఫీ, 11.50 లక్షల కుటుంబాలకు రూ.7వేల కోట్లకుపైగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నాటికి అంచెలంచెలుగా రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రైతు రుణమాఫీ దేశ చరిత్రలో సువర్ణ అధ్యాయమని కొనియాడారు.

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అవన్నీ పట్టించుకోకుండా ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా సంక్షేమ అభివృద్ధికి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, పేదలకు ఉచిత కరెంటు, రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ వంటి పథకాలు చరిత్రలో నిలిచిన సంక్షేమ పథకాలని కొనియాడారు. రైతుల రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తామన్న బీఆర్ఎస్ నేతలు అందుకు సిద్ధంగా ఉండాలని వీరేశం ఎద్దేవా చేశారు.

● దేవరకొండలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని అమలుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీలక్ష్మీ, ఏవో రవికుమార్, మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జాల నర్సింహారెడ్డి, జూలూరి ధనలక్ష్మీ బాలనారాయణగౌడ్, సిరాజ్‌ఖాన్, పున్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న నాయకులు, రైతులు

● నార్కట్‌పల్లి, చిట్యాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై మాట్లాడారు. రూ. 2 లక్షల రుణమాఫీ చేసిన అరుదైన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. వ్యవసాయాన్ని సాగు చేసుకునేందుకు రైతులు బ్యాంకుల్లో రుణాలను తీసుకుంటారని వాటిని చెల్లించేందుకు అష్టకష్టాలు పడతారని వారి కష్టాలు తెలిసిన ప్రభుత్వం రైతుల రుణమాఫీని ప్రకటించిందని తెలిపారు. రైతాంగం అభ్యున్నతిని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఎన్నో నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే వీరేశం ట్రాక్టర్‌ను నడుపుతూ రైతులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, నకిరేకల్ డివిజన్ ఏడీఏ రామారావునాయక్, ఎంపీడీవో జయలక్ష్మీ, ఏవోలు గిరిబాబు, గిరిప్రసాదర్, నాయకులు బత్తుల ఊశయ్య, బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సత్తయ్య, ఏవో అచ్చాలు, భరత్, సమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలబడుతుందని అన్నారు. తొలివిడతో భాగంగా నియోజకవర్గంలో 12,975 మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ జమ కానుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏడీఏ నా గమణి, అధికారులు హరిబాబు, శేషగిరిశర్మ, సరిత, సైదులు, స్వప్న, రమేష్, నాయకులు ఉపేందర్ రెడ్డి, సైదులు, నర్సిరెడ్డి, బసవయ్య పాల్గొన్నారు.

● అనుముల మండలంల కొత్తపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు యడవల్లి నరేందర్‌రెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, ఎంపీడీవో సుజాత, ఏవో సరిత, పీఏసీఎస్ చైర్మన్ రిక్కల మధుసూదన్‌రెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, రాంబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడు రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని అమలు చేసి వ్యవసాయం దండగ కాదు... పండగ అని నిరూపించిందని అన్నారు. గ్రామాల నుంచి రైతులు ద్విచక్ర వాహనాలతో తరలివచ్చారు. రైతు వేదిక వద్ద ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ఎద్దుల బండిపై డీసీసీబీ చైర్మన్‌తో పాటు పలువురు, అధికారులు, నాయకులు ఎక్కి చక్కర్లు కొట్టారు. కార్యక్రమంలో ఏడీఏ ఎల్లయ్య, ఎంఏవో శ్రీనివాస్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్‌నేత, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఏఈవోలు, అధికార పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● చండూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఏవో రేవతి, ఏఈఓ లు నిఖిల్, నాగార్జున్, మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న పాల్గొన్నారు.

● కేతేపల్లిలో మండలంలోని వివిధ గ్రామాల్లో రుణమాఫీ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఏవో బి.పురుషోత్తం, మాజీ ఎంపీపీ పి.శేఖర్, నాయకులు గుత్తా మాధవరెడ్డి, బొజ్జ సుందర్, పి.ఇందిర, కె.మహేందర్‌రెడ్డి, ఎం.వెంకట్రాంరెడ్డి, మట్టి సాల్మన్ పాల్గొన్నారు.



చిట్యాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

● త్రిపురారంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడిమల్ల బుచ్చిరెడ్డి, నాయకులు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, రవికుమార్ పాల్గొన్నారు.

● వేములపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు తమ్ముడబోయిన అర్జున్, మాలి కాంతారెడ్డి పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏవో వెంకన్న, ఏఈవో సర్ధార్, సురేష్, సీఈవో తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, లాలునాయక్, జగన్‌నాయక్, పిల్లి రామస్వామి పాల్గొన్నారు.

● దామరచర్లలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణమాఫీతో పేద రైతుల జీవితాల్లో వెలుగులు నిండాయని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, నాయకులు బంటు కిరణ్, కర్ర నాగునాయక్, గాలం వెంకన్నయాదవ్, అన్నెం కరుణాకర్‌రెడ్డి, సిద్ధునాయక్, నాగరాజు, నరసింహారెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

● మాడ్గులపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు, నాయకులు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, ఏవో సైదానాయక్, వెంకన్న, యాదగిరి, ప్రసాద్, సతీష్, లచ్చయ్య, సైదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● చింతపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు లింగంపల్లి వెంకటయ్య, ఏవో శ్రవణకుమారి, ఎరుకుల వెంకటయ్యగౌడ్, గుండ్లపల్లి నరసింహారెడ్డి, అశోక్‌గౌడ్, రవికుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో రైతు వేదిక వద్ద ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



దామరచర్లలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



రైతులు, వ్యవసాయ అధికారులతో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మునుగోడులో నిర్వహించిన సంబురాల్లో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

'మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం'

చిట్యాలరూరల్, జూలై 18: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పెద్దకాపర్తిలో గురువారం సీసీరోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, అందుకు ప్రభుత్వం నిధులను కేటాయిస్తుందన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు సంక్షేమ పథకాల అమలుకు తగిన ప్రాధాన్యతనిస్తామన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి, నాయకులు గుడిపాటి లక్ష్మీనర్సింహ, ఏనుగు రఘుమారెడ్డి, నీలకంఠం లింగస్వామి, గంట్ల రవి, పొట్లపల్లి సురేష్, వెంకటేష్, తిరుమలేష్, మహేష్, మల్లేష్, లింగస్వామి పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన ఏకాదశి మహాయజ్ఞం

కట్టంగూరు, జూలై 18: జిల్లాలోని ఏకైక శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందిన కట్టంగూరులోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో గురువారం వార్షిక ఏకాదశి మహాయజ్ఞం మహాపూర్ణాహుతితో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాయజ్ఞం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మిట్టపల్లి శివశంకర్, నీల వేణు, గుండు వెంకన్న, రాంమూర్తి, రెడ్డిపల్లి మనోహర్, మల్లికార్జున్, రాపోలు వెంకన్న, ఓరుగంటి హరిబాబు, కోమటి భాస్కర్, కృష్ణవేణి, జ్యోతి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ డివిజన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

నకిరేకల్, జూలై 18: మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) నకిరేకల్ డివిజన్ నూతన కమిటీని పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకు న్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా కందుల లాజరస్, అధ్యక్షుడు వంటల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి గోపినాధ్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాటిపాముల సైదులు, కోశాధికారి బొజ్జ శ్యామ్, అదనపు జనరల్ సెక్రటరీ పెర్కె నర్సింహ, ఉపాధ్యక్షులు శ్రీపతి యాదగిరి, ఆదిమళ్ల కృష్ణ ప్రచారకార్యదర్శి గద్దల చంద్రయ్య, కార్యవర్గసభ్యులు మాచర్ల యాదగిరి, నకిరేకంటి వెంకన్న ఎన్నికయ్యారు. సమావేశంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు మామిడి సైదులు, ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

21న గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక ధ్యానం

నల్లగొండ, జూలై 18: ఈ నెల 21వ తేదీన గురుపౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక ధ్యానంతో పాటు యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ధమ్మ పీఠం ధ్యాన కేంద్రం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక ధ్యానం, యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సావర్కర్‌నగర్‌లోని బసవేశ్వర్ భవన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.

ఘనంగా జగదీష్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

నల్లగొండ, తిరుమలగిరి(సాగర్), దేవరకొండ, హాలియా, మునుగోడు, జూలై 18: మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ రూపురేఖలను ఎంతగానో మార్చిన గొప్ప నాయకుడని కొనియాడారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలో మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి జిల్లా చేసిన అభివృద్ధి పనుల గురించి కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్‌తో పాటు నాయకులు నిరంజన్ వలీ, కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్‌యాదవ్, బొర్ర సుధాకర్, రెగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, మారిపద్ది శ్రీనివాస్, బక్క పిచ్చయ్య, బోనగిరి దేవేందర్, దేప వెంకట్ రెడ్డి, అయితగోని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

● దేవరకొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుడిగా, మంత్రిగా జగదీష్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశాడని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చింతపల్లి సుభాష్, వేములరాజు, కృష్ణ, సత్తార్, జానిబాబా పాల్గొన్నారు.



నల్లగొండలో కేక్ కట్ చేసి రవీంద్రకుమార్‌కు తినిపిస్తున్న భూపాల్‌రెడ్డి

● హాలియాలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కార్యకర్తల సమక్షంలో కేక్‌ను కట్ చేసి జగదీష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, సతీష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో తెలంగాణ స్వరాష్ట్రంలో కేసీఆర్ వెంట నడిచి రాష్ట్ర, జిల్లా అభివృద్ధికి జగదీష్ రెడ్డి ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లి పెద్దిరాజు, నాగెండ్ల వెంకట్‌రెడ్డి, నాసర్‌రెడ్డి పాల్గొన్నారు.

● మునుగోడు పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బీసీ విజయ్‌గౌడ్, ఈద శరత్‌బాబు, సురేష్‌కుమార్, అంజయ్య, కర్నాకర్‌యాదవ్, పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

చిట్యాల, తిరుమలగిరి(సాగర్), పెద్దఅడిశర్లపల్లి, జూలై 18: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందనీ మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. గురువారం చిట్యాల జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఈడీ టీచర్లకు పీఎస్ హెచ్‌ఎంగా ప్రమోషన్‌కు, లెఫ్ట్ ఓవర్ వేకేన్సీ నింపడానికి పీఆర్‌టీయూ పోరాడుతుందన్నారు. అలాగే ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధించడానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొసనం కరుణాకర్‌రెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గోలి స్లీవమ్మ, జానారెడ్డి, రవీందర్‌రెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) జడ్పీహెచ్ఎస్‌లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కాంప్లెక్స్ హెచ్‌ఎం, మండల నోడల్ అధికారి శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. టీచర్ల సమస్యలపై పీఆర్టీయూ పోరాటం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సక్రునాయక్, మొక్క పరశురాం, సైదిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భానునాయక్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సంఘం మండల అధ్యక్షుడు కె. మూనా ప్రారంభించి మాట్లాడారు. ప్రతి టీచర్‌కు గ్రూప్ ఇన్సూరెన్స్ రక్షణ ఉండాలనే ఉద్దేశంతో క్రియాశీలక సభ్యత్వాన్ని నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్యదర్శి అనిల్‌కుమార్, తరాల పరమేష్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, సైదులు, శ్రీనివాస్‌రావు, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

మంత్రి వెంకట్‌రెడ్డి కృషితో రైతులకు మేలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంపత్‌రెడ్డి, నాగరత్నం రాజు

నల్లగొండ, జూలై 18: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృషితో రుణమాఫీ కింద రైతులకు ప్రయోజనం చేకూరిందని డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, నల్లగొండ పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నంరాజు అన్నారు. గురువారం రుణమాఫీ సంబురాల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిత్యం రుణమాఫీ విషయంలో కలిసి జిల్లాకు తొలిరోజు లక్ష రుణమాఫీ విషయంలో రూ.481.63కోట్లను మంజూరు చేయించారని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

'బియ్యం పక్కదారి పట్టిస్తే డీలర్‌షిప్ రద్దు'

చందంపేట, జూలై 18: రేషన్‌బియ్యం పక్కదారి పట్టిస్తే డీలర్‌షిప్ రద్దు చేస్తామని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం చందంపేట మండలంలోని చిత్రియాల, బుడ్డోనితండా, రేకులగడ్డ, పెద్దమూల గ్రామాలలోని రేషన్‌షాపులను తనిఖీ చేశారు. రేషన్‌షాపుల్లో నిల్వలు సరిగా ఉన్నాయా లేదా అని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోమెట్రిక్ లేనిదే ఎవరికి రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేయవద్దని, బియ్యం పక్కదారిపడితే డీలర్‌షిప్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట విజన్‌టెక్ సిబ్బంది ఉన్నారు.

నేర్చుకోవాలన్న తపన ఉండాలి

మిర్యాలగూడ టౌన్, జూలై 18: నేర్చుకోవాలన్న తపన ఉండే విద్యార్థులు జీవితంలో సత్ఫలితాలు సాధిస్తారని ప్రముఖ వాస్తు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు మామిడి సత్యనారాయణ అన్నారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసంపై ఉచిత శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, మెళకువ నైపుణ్యాలను పెంపొందించుకుంటే చదువుతో పాటు నిజ జీవితంలో రాణించగలుగుతారని అన్నారు. విద్యార్థినులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమారి, నాగలత, రజిత, కళమ్మ, అనిత, సుకన్య, సునంద పాల్గొన్నారు.

21న క్రికెట్ జిల్లా జట్లు ఎంపిక

మిర్యాలగూడ టౌన్, జూలై 18: అండర్-25, 19, 16 జిల్లా జట్లను ఓపెన్ సెలక్షన్స్ ద్వారా ఈ నెల 21వ తేదీన ఎంపిక చేయనున్నట్లు డిస్ట్రిక్ట్ సెక్రటరీ నాయిని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విద్యానగర్ క్లియో స్పోర్ట్స్ ఎరేనా స్టేడియంలో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయో నిర్ధారణ, గుర్తింపు పత్రాలతో హాజరుకావాలని ఆయన సూచించారు. ఆసక్తి గలవారు పోటీలకు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: మండల పరిధిలోని మాండ్ర గ్రామానికి చెందిన పంగరాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన బాల్య స్నేహితులు పంగరాజు కుటుంబానికి 90వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో అల్గాస్ మహేష్, దొండ మత్స్యగిరి, మల్లేష్, సురేష్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని శాలిగౌరారం మార్కెట్, శాలిగౌరారం ప్రాథమిక, మనిమద్దె ప్రాథమిక, జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు దుస్తులు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.

చిట్యాల: అర్హులందరికీ వెంటనే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చిట్యాలలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను వెంటనే పేదలకు పంపిణీ చేయాలని కోరారు.

కేతేపల్లి: మండంలంలోని చెరుకుపల్లి గ్రామానికి చెందిన మాచర్ల సైదులు ఇటీవల బైక్ పైనుంచి పడి తీవ్రగాయాలపాలయ్యాడు. చికిత్స కోసం దాదాపు రూ.3లక్షలు వెచ్చించాల్సి ఉంది. ఈ క్రమంలో సైదులును చికిత్స కోసం స్నేహితులు హైదరాబాద్‌లో పేదల డాక్టర్‌గా పేరుపడిన ఆలేటి శ్రీనివాస్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. సైదులు పరిస్థితిని వివరిస్తూ వాట్సాప్ గ్రూపులో వివరించారు. దీంతో మండలంలోని గ్రామాలకు చెందిన వ్యక్తులు నిధులు పోగుచేసి ఓ హెల్మెట్‌తో మొత్తం రూ.42 వేలు వైద్య చికిత్సలు చేసిన పవన్‌సాయి ఆసుపత్రి వైద్యులు ఆలేటి శ్రీనివాస్‌కు అం దించారు. దాదాపు రూ.3లక్షల విలువైన వైద్యాన్ని రూ.42వేలకు అందించిన డాక్టర్ శ్రీనివాస్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మునుగోడు రూరల్: పేద ప్రజలకు అండ ఎర్రజెండా అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్లురి నరసింహ పేర్కొన్నారు. మండలంలోని పులిపలుపులలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని అన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు వెంకన్న, ఎల్లయ్య, జి.భాస్కర్, కె.రాములు, జె.శంకర్, నగేష్, యాదయ్య, యాదయ్య పాల్గొన్నారు.

దామరచర్ల: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను, ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్, మండల కార్యదర్శి వీరన్ననాయక్ శ్రీకాంత్, గిరిధర్, విష్ణు, అజయ్ పాల్గొన్నారు.


హాలియా: క్రీడలతో యువకులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పంగవానికుంట గ్రామంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో చింతల చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, అబ్బిడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చింతపల్లి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండలల పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో ఆయనమాట్లాడారు. ఎన్నికల హామీలను సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జెల నరసింహారెడ్డి, గోవర్ధన్, కృష్ణగౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.

వేములపల్లి: మండలంలోని రావులపెంట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంఈవో బాలాజీనాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థుల మనస్సులో చోటు సంపాదించుకోవచ్చని అన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్‌లో టీపీయూఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి పెంటయ్య మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'ఆశా'ల సమస్యలు పరిష్కరించాలి



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, దేవరకొండ, మునుగోడు, జూలై 18: ఆశా వర్కర్ల తమ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో మంత్రి కోమటిరరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలన్నారు. లేనిచో ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు గణేష్, సైదాచారి, పార్వతమ్మ, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

● దేవరకొండలో ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే బాలునాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్లకు నెలకు రూ.18వేలు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి నల్ల వెంకటయ్య, నాయకులు యాదగిరి, ఆశావర్కర్లు నిర్మల, పుష్పలత, కళావతి, జయ తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆశాలు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, నాయకులు చంద్రమౌళి, ముత్యాలు, ధనుంజయ, ఆశాలు కవిత, వసంత, జ్యోతి, లలిత, పద్మ పాల్గొన్నారు.